క్లుప్తంగా

పాఠ్యపుస్తకాలు మంజూరు

మిడుతూరు: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల, కస్తూర్బా బాలికల విద్యాలయాల్లో విద్యను అభ్యసించే విద్యార్థులకు 4,718 పాఠ్య పుస్తకాలు, 24,152 నోట్ పుస్తకాలు మంజూరైనట్లు ఎంఈఓ రామిరెడ్డి శనివారం తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభమైన వెంటనే విద్యార్థులకు పంపిణీ చేస్తామని చెప్పారు.

అలరించిన ప్రవచనాలు


ప్రవచనం వినిపిస్తున్న శివశ్రీశర్మ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా శనివారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద కడపకు చెందిన శివశ్రీశర్మ మాడుగుల హనుమద్వైభవంపై ప్రవచనాలు వినిపించారు.

అన్నదాన పథకానికి విరాళం

మహానంది: క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన ప్రసాద పథకానికి గోపవరం గ్రామానికి చెందిన మహానంది దేవస్థానం ట్రస్ట్‌బోర్డు తొలి చైర్మన్ రామసుబ్బారెడ్డి కుమారుడు నాగార్జునరెడ్డి, శివగౌరి దంపతులు రూ. 20వేలు విరాళం అందించారు. శనివారం వారు కార్యాలయానికి చేరుకుని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డికి నగదు అందించారు. వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి అభినందించారు.

వర్మీ కంపోస్ట్ తయారు చేయండి

మహానంది: బండిఆత్మకూరు మండలం అయ్యవారి కోడూరులో చెత్తసేకరణ కేంద్రంలో వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేసేలా చర్యలు తీసుకోవాలని ఈఓఆర్‌డీ శ్రీనివాసులు, ఎస్‌డబ్ల్యూపీసీ రీసోర్స్ పర్సన్స్ శేషన్న, రామ్‌గపాల్ తెలిపారు. శనివారం వారు గ్రామంలోని చెత్తసేకరణ కేంద్రాన్ని పరిశీలించి పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ జగన్‌మోహన్, పార్నపల్లె పంచాయతీ కార్యదర్శి రాముడుకు పలు సూచనలు చేశారు.

ఘర్షణలకు దూరంగా ఉండండి


పార్టీల నాయకులకు నోటీసు అందజేస్తున్న సీఐ

శ్రీశైలం : ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా, ఫలితాల తరువాత రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఘర్షణలకు దూరంగా ఉండాలని సీఐ ప్రసాదరావు సూచించారు. శనివారం శ్రీశైలంలోని వన్‌టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ రౌడీ షీటర్లపై నిఘా ఉంచామని, ఇప్పటికే వారిని బైండోవర్ చేశామన్నారు. సదరు వ్యక్తులు ఏదైనా నేరానికి పాల్పడితే బైండోవర్ కేసులో షూరిటీ ఇచ్చిన మొత్తం చెల్లించాల్సి వస్తుందని, నాన్ బెయిలబుల్ కేసుల నమోదుతో పాటు జిల్లా బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల ఫలితాలపై పందేలు వేసుకోవడం కూడా నేరమేనని, వారిపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. అలాగే సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టినా, ప్రసంగాలు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వేధింపుల కేసు నమోదు

మహానంది: భర్త తనను సరిగా చూసుకోకపోవడంతో పాటు వివాహేతర సంబంధం పెట్టుకుని వేధింపులకు గురిచేస్తున్నారని భార్య హుసేనమ్మ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మహానంది మండలం పుట్టుపల్లె గ్రామానికి చెందిన హుసేనమ్మకు గోస్పాడు మండలం పసురపాడుకు చెందిన రమేష్‌తో వివాహమైంది. అయితే భర్త ఇటీవల వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తనను వేధిస్తున్నారని భార్య ఫిర్యాదు మేరకు భర్త, అత్త, మామలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు

దోమల నివారణ చర్యలు తీసుకోవాలి


ఓంకారంలో మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

మహానంది: ప్రజలు దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ కామేశ్వరరావు తెలిపారు. బండిఆత్మకూరు మండలంలోని ఓంకారం పుణ్యక్షేత్రం పరిసరాల్లో శనివారం ఆయన పర్యటించి డీడీటీ పిచికారీ చేయించారు. ఏఎంఓ ప్రసాద్‌రెడ్డి, సిబ్బంది వెంకటేశ్వరరెడ్డి, శంకరాచారి, నాగవేణి, స్వర్ణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హిందూ ధర్మ ప్రచారకులు మల్లు వెంకటరెడ్డి


ఆలయం వద్ద జరుగుతున్న అన్న సంతర్పణ


పూజల్లో పాల్గొన్న భక్తులు


మహానందిలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


రోళ్లపాడులో ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

ఘనంగా హనుమాన్ జయంతి

మిడుతూరు: నిస్వార్థమైన సేవకు ప్రతీక హనుమంతుడేనని కర్నూలు జిల్లా ఇస్కాన్ ధర్మ ప్రచారకులు రఘునందన్ సేవక్ దాస్ జీ అన్నారు. శనివారం మండలంలోని పీరుసాహెబ్ పేట గ్రామంలోని రామాలయంలో తిరుమల తిరుపతి దేవస్థాన హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వహకులు మల్లు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని ఆలయంలో తొలుత హనుమంతుడికి పంచామృతాభిషేకం, ఆకుపూజ, హనుమాన్ చాలీసా పారాయణం, సామూహిక కుంకుమార్చన, గోపూజ, భజనలు, నగర సంకీర్తన తదితర విశేష పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. జయదేవానంద స్వామిజీ మాట్లాడుతూ ఇతిహాసాలు, భారతీయ సంస్కృతిని ప్రపంచానికి చాటాయని, ప్రతి ఒక్కరూ భక్తి భావంతో మెలగాలని సూచించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బరక సంజీవరాయ స్వామికి ప్రత్యేక పూజలు

మిడుతూరుతో పాటు చెరుకుచెర్ల, తలముడిపి, మాసపేట, తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన శ్రీ బరక సంజీవరాయ స్వామికి శనివారం అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన, తదితర పూజలను ఆలయ పురోహితులు నరహరి శర్మ శాస్త్రోక్తంగా చేపట్టారు.

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రాజెక్ట్ కాలనీలోని శ్రీపంచముఖి ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం హనుమాన్ జయంతిని నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో హనుమంతునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు రామభక్త హనుమంతుని సేవల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదానం చేశారు.

నందికొట్కూరు: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో హనుమాన్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయం, సీతారామాలయంలో ఆంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పాములపాడు మండలంలో ఆకుపూజ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు.


కొత్త ఎల్లాలలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మహానంది: మహానంది ఆలయంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ఆలయ ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, ముఖ్య అర్చకులు మణికంఠశర్మ ఆధ్వర్యంలో స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు చేపట్టారు. ఈ మేరకు తెల్లవారుఝామున విశేష అభిషేకం, ప్రాతఃకాల అర్చన, సింధూరంతో అలంకారం, తమలపాకులతో సహస్రార్చనలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

➡ బండిఆత్మకూరు మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన ఓంకారం పుణ్యక్షేత్రంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. చైర్మన్ విశ్వనాథరెడ్డి, ఈఓ నాగప్రసాద్ ఆధ్వర్యంలో అర్చకులు స్థానిక అశ్వర్థ వృక్షం వద్ద కొలువైన శ్రీ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పెద్దదేవలాపురంలోని ఏకశిలా అభయాంజనేయస్వామి ఆలయంలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు.

ఆత్మకూరు: పట్టణంతో పాటు, మండలంలోని శ్రీపతిరావుపేట గ్రామంలో శనివారం శ్రీ హనుమాన్ జయంతి ఉత్సవాలు వేడుకగా చేపట్టారు. పట్టణంలోని శివాలయం, శ్రీ సీతారాముల ఆలయం, పాత బస్టాండ్‌లోని ఆంజనేయస్వామి ఆలయంతో పాటు పలు దేవాలయాల్లో వెలిసిన శ్రీ ఆంజనేయస్వామికి, శ్రీపతిరావుపేటలోని సంజీవ ఆంజనేయస్వామికి భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని తమలపాకులు, బంతిపూలు, వడలతో అలంకరించి నైవేద్యం సమర్పించారు.

పగిడ్యాల: మండలంలోని గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. కొత్త ఎల్లాల గ్రామంలో పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ ఆంజనేయ స్వామి దేవాలయంలో విశేష పూజలు చేసి ఉత్సవ మూర్తులను రథంపై అధిష్టింపజేసి రథోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పూజల్లో డాక్టర్ బైరెడ్డి మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మండలంలోని గ్రామాల్లో వేడుకలను నిర్వహించారు. అర్చకులు స్వామివారికి పంచామృతాభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన వంటి విశేష పూజలు చేపట్టారు. హనుమాన్ పారాయణం చేస్తూ భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. తూడిచెర్ల గ్రామంలో సాయంత్రం ట్రాక్టర్‌పై స్వామివారి ఉత్సవవిగ్రహాన్ని, పటాన్ని ఉంచి గ్రామోత్సవం జరిపించారు.


మహానందిలో వడల హారంతో స్వామి వారు

➡ మహానంది ఆలయంతో పాటు గ్రామాల్లో శనివారం హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. తిమ్మాపురం, అబ్బీపురం, బుక్కాపురం, గాజులపల్లె ఆర్‌ఎస్, తమ్మడపల్లె గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతి సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. స్వామివారికి ఇష్టమైన ఆకుపూజ, వడలతో అలంకరించారు.


పెద్దదేవలాపురం ఏకశిలా అభయాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

శ్రీశైలంలో శాస్త్రోక్తంగా హనుమజ్జయంతి


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో హనుమజ్జయంతిని పురస్కరించుకుని శనివారం పాతాళ గంగమార్గంలో శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. ముందుగా దేశం శాంతి సౌభాగ్యాలలో విలసిల్లాలని, ప్రకతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని, జనులందరికి ఆయురారోగ్యాలు కలిగి, వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలని అర్చకులు సంకల్పం పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజ చేశారు. అనంతరం ఆంజనేయస్వామి వారికి ఆయా సూక్తాలతో పంచామృతాభిషేకం, జలాభిషేకం చేపట్టి ప్రత్యేకంగా అలంకరించి అష్టోత్తరపూజ, నాగవల్లిదళపూజ (ఆకుపూజ), వడమాల సమర్పణ, పుష్పార్చన జరిపించారు. కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు పాల్గొన్నారు.


పాములపాడు మండలంలో విశేష అలంకరణలో ఆంజనేయస్వామి


మల్లన్న సేవలో తెలంగాణ ఎమ్మెల్యేలు

మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యేలు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు ఎమ్మెల్యేలు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. శనివారం మల్లన్న దర్శనార్థం వచ్చిన వారు శ్రీస్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన జరిపించుకున్నారు. మల్లన్నను దర్శించుకున్న వారిలో కల్వకుర్తి, నాగర్ కర్నూలు ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణ, కుచుకుళ్ల రాజేష్ రెడ్డి దంపతులు, వనపర్తి, కూకట్‌పల్లి ఎమ్మెల్యేలు తుడి మేఘారెడ్డి, మాధవరం కృష్ణారావు ఉన్నారు.

సిబ్బందికి అండగా ఉంటాం

బొమ్మలసత్రం: పోలీస్ సిబ్బంది కుటుంబాలకు ఎల్లప్పుడూ వెన్నంటి ఉంటామని జిల్లా ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో హోంగార్డు సుభాన్ పదవీ విరమణ సందర్భంగా ఎస్పీ అభినందించి మాట్లాడారు. సుభాన్ హోంగార్డుగా పోలీస్ శాఖకు 1988 నుంచి సేవలందించారని ఆయనకు ఎటువంటి అవసరమొచ్చినా నేరుగా తమను సంప్రదించవచ్చని చెప్పారు. ప్రస్తుతం ఆత్మకూరులో విధులు నిర్వహిస్తూ సుభాన్ పదవీవిరమణ పొందారన్నారు. అడిషనల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఏఆర్ సీఐలు నాగభూషణం, మంజునాథ్ , హోంగార్డు ఇన్‌చార్జ్ దాసునాయక్ పాల్గొన్నారు.


సుభాన్‌ను సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి



పక్షం క్రితం : రుద్రవరం సమీపంలో మోడుబారిన నల్లమల అడవి, ప్రస్తుతం పచ్చదనంతో కళకళలాడుతున్న అడవి

చిగురు తొడిగిన నల్లమల

పచ్చటి అందాలు,పక్షుల కిలకిలరావాలతో ఆహ్లాదకర వాతావరణంతో పర్యాటకులకు నల్లమల అడవి ఎంతో అనుభూతినిచ్చేది. అయితే వేసవిలో ఆకులన్నీ రాలి అడవంతా మోడువారి కళావిహీనంగా మారింది. గతేడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడం,ఎండలు అతి తీవ్రంగా ఉండటంతో అడవంతా పచ్చదనం కోల్పోయింది. ఇటీవల వరుసగా మూడు భారీ వర్షాలు కురవడంతో అడవి మళ్లీ చిగురు తొడిగింది. దీంతో పచ్చగా కళకళలాడుతోంది.

– రుద్రవరం

మహానందీశ్వరుడి సేవలో

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో రాయలసీమ జోన్ జైళ్లశాఖ డీఐజీ కె.రాజేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలిసి శనివారం పూజలు నిర్వహించారు. దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఇన్‌స్పెక్టర్ నీలకంఠరాజు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం ఆయనకు స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదపండితులు ఆశీర్వచనాలు పలికారు.

➡ మహానంది దేవస్థానం ఉప కమిషనర్‌గా పనిచేసిన రిటైర్డ్ ఈఓ సత్యశ్రీహర్ష శనివారం శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. పూజల అనంతరం స్థానిక అలంకార మండపంలో ఆయనకు వేదపండితులు రవిశంకర అవధాని స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.


మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన డీఐజీ రాజేశ్వరరావు, కుటుంబ సభ్యులు

చెన్నకేశవస్వామి కల్యాణం

నందికొట్కూరు: పాములపాడు మండలంలోని జూటూరు గ్రామంలో చెన్నకేశవస్వామి శనివారం కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేడుకను తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు.

వాణిజ్య బ్యాంకులకు ధీటుగా ఏపీజీబీ సేవలు

మహానంది: వాణిజ్య బ్యాంకులకు ధీటుగా ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ సేవలందిస్తుందని తిమ్మాపురం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ఎస్.సుధీంద్ర కుమారి తెలిపారు. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ 19వ వార్షికోత్సవం సందర్భంగా ఏపీజీబీ తిమ్మాపురం శాఖలో వినియోగదారులతో కేక్ కట్ చేయించారు. ఫీల్డ్ ఆఫీసర్ ధరణి, అసిస్టెంట్ మేనేజర్ గిరీష్, క్యాషియర్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మిడుతూరు: చెరుకుచెర్ల గ్రామానికి చెందిన కురువ సంజీవ అనే వ్యక్తి నుంచి 20 క్వార్టర్స్ అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్ మోహన్ శనివారం తెలిపారు.

కేసు నమోదు..

మిడుతూరు గ్రామానికి చెందిన ప్రియదర్శిని అనే మహిళకు నాగలూటి గ్రామానికి చెందిన వినోద్‌తో వివాహం జరిగింది. భార్య, భర్తల మధ్య జరిగిన గొడవలో భార్యపై భర్త దాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్త నాగరాజు, అత్త జయమ్మ, మామా నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రశాంతంగా మాన్యం కౌలుకు వేలం

నందికొట్కూరు: దేవాలయాల భూముల వేలం పాటలు ప్రశాంతంగా జరిగాయని ఈఓ వెంకటరమణ తెలిపారు. శనివారం పాములపాడులోని చౌడేశ్వరి దేవి ఆలయ ఆవరణలో లక్ష్మీ చెన్నకేశవ స్వామి, నాగలింగేశ్వరస్వామి, చౌడేశ్వరిదేవి దేవాలయాలకు చెందిన 63 ఎకరాల భూముల కౌలుకు దేవదాయ శాఖ అధికారులు వేలం నిర్వహించారు. మూడేళ్ల కాలపరిమితికి వేలం నిర్వహించడంతో రూ.6.87 లక్షల ఆదాయం వచ్చిందని చెప్పారు.

పింఛన్ కష్టాలు

జూపాడుబంగ్లా: చంద్రబాబునాయుడు చర్యలు కారణంగా ఈ నెల కూడా పింఛన్ దారులు పింఛన్ సొమ్ముకోసం పాట్లు పడుతున్నారు. మండుటెండల్లో పింఛన్ కోసం బ్యాంకు చుట్టూ తిరగాల్సి వస్తుందని వృద్ధులు వాపోతున్నారు. మండలకేంద్రంతో పాటు, పారుమంచాలలో ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులు, నందికొట్కూరులోనున్న స్టేట్‌బ్యాంకు వద్ద లబ్ధిదారులు గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా ఆరు మండలాల్లో 34,254 పింఛన్లు మంజూరు కాగా అందులో 8,382 మందికి మాత్రమే సచివాలయ ఉద్యోగులు ఇళ్ల వద్దకు వెళ్లి పింఛను సొమ్ము అందజేస్తారని అధికారులు పేర్కొంటున్నారు. మిగిలిన 25,872 మందికి వారి బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. జూపాడుబంగ్లా మండలంలో 4,974 పింఛన్‌దారులుండగా వారిలో 1,133 పింఛన్‌దారులకు ఇళ్ల వద్దకే అందజేయనుండగా మిగిలిన 3,841 మందికి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు అధికారులు తెలిపారు.


జూపాడుబంగ్లా ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు వద్ద పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు


అక్షరాభ్యాసాలు చేయిస్తున్న పండితులు

కొత్తపల్లి: మండలంలోని శైవక్షేత్రాలైన సంగమేశ్వరం, కొలనుభారతి క్షేత్రాల్లో భక్తులు విశేష పూజలు చేశారు. శనివారం హనుమాన్ జయంతి కావడంతో సంగమేశ్వరంలో ప్రాచీన వేపదారు శివలింగానికి, పంచముఖ ఆంజనేయస్వామి వారికి భక్తులు కుంకుమార్చన, పుష్పార్చన, నదీజలాలతో అభిషేకం వంటి ప్రత్యేక పూజలు చేశారు. కొలనుభారతి క్షేత్రంలో సుదూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి పుష్పార్చ, అభిషేకాలు, ధారుఘోషిని నదీ జలాలతో అభిషేకం చేశారు. పలువురు తల్లిదండ్రులు తమ చిన్నారులకు ఆలయ అర్చకులు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం చేయించారు. ఎదురుపాడు, కొత్తపల్లి, గ్రామాల్లో హనుమాన్ జయంతివేడుకల సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు.


ప్రత్యేక అలంకరణలో కొలనుభారతి అమ్మవారు


ప్రాచీన సంగమేశ్వరంలో పంచముఖ ఆంజనేయ స్వామి

ఆత్మకూరులో పోలీసుల మాక్ డ్రిల్

ఆత్మకూరు: ఎన్నికల కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకుని పట్టణంలో శనివారం సాయంత్రం పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో పోలీసులు కవాతు చేపట్టారు. డీఎస్పీ మాట్లాడుతూ కౌంటింగ్ దృష్ట్యా ఏ చిన్నపాటి సమస్య సృష్టించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గెలిపొందిన వారు బాణసంచా పేల్చడం, ఊరేగింపులు, రహదారుల వెంట కేకలు వేయడం వంటివి చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. అభ్యర్థులు, ఏజెంట్లు మినహా కౌంటింగ్ కేంద్రాల వద్దకు ఎవరూ రాకూడదని చెప్పారు. అనంతరం మాక్ డ్రిల్ నిర్వహించి పోలీసుల చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నంద్యాల టర్నింగ్ నుంచి గౌడ్ సెంటర్ మీదుగా పోలీస్‌స్టేషన్ వరకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఆత్మకూరు సీఐలు లక్ష్మినారాయణ, నాగభూషణం, నంద్యాల ఆర్ఐ శ్రీనివాసులు, ఎస్ఐలు హరిప్రసాద్, భూపాలుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


పట్టణంలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు